క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 2న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. అశోక కాలనీ, వికాస్‌నగర్, ప్రెసిడెన్సీ స్కూల్, వాజ్‌పేయి కాలనీ, విద్యానగర్, భవానీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు 'రైతు నేస్తం'

హన్మకొండ: రైతులకు సాగు సూచనలు ఇచ్చే రైతు నేస్తం కార్యక్రమాన్ని దృశ్య, శ్రవణ విధానం ద్వారా మంగళవారం నిర్వహించనున్నట్లు హనుమకొండ వ్యవసాయ సహాయ సంచాలకుడు దామోదర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ పలివేల్పులలోని రైతు వేదికలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని వీక్షించవచ్చని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 గంటలకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బీ.గోపి మాట్లాడుతారని, 10.25గంటలకు వ్యవసాయ సాగు పద్ధతులు, పంటలకు ఆశించే తెగులు, నివారణ చర్యలు, అధిక దిగుబడులు సాధించడానికి చేపట్టాల్సిన విధానాలను శాస్త్రవేత్తలు వివరిస్తారని తెలిపారు.

నేడు మందబుద్ధిపై అవగాహన సదస్సు

నయీంనగర్: మల్లికాంబ మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో మందబుద్ధిపై అవగాహన సదస్సును మంగళవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామలీల తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రామలీల మాట్లాడుతూ జనాభాలో మూడు శాతం మంది పిల్లలు మందబుద్ధితో పుడుతున్నారని తెలిపారు. దానికి కారణం అవగాహన లోపమేనని వివరించారు. మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొని మానసిక దివ్యాగులు పుట్టడానికి కారణాలు, పుట్టకుండా ఉండడానికి నివారణ చర్యలు, పుట్టిన పిల్లలకు ఏ విధంగా శిక్షణ ఇవ్వాలో వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల అప్పగింత




రామన్నపేట: ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఆరుగురి బాధితులకు తిరిగి వాటిని అప్పగించారు. సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి ఆ ఫోన్లను గుర్తించి సోమవారం వారికి అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్నట్లయితే మీసేవాలో దరఖాస్తు చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా జాన్ మార్కండేయ



కాజీపేట: ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా కాజీపేట పట్టణానికి చెందిన బిషప్ డాక్టర్ జాన్ మార్కండేయ ఎంపికయ్యారు. ఆల్ఫా ఓమెగా చర్చిని నిర్మించడంతో పాటు పేద కుటుంబాలు, యువతకు అండగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఈమేరకు ఆయనను సంఘం నాయకులు సోమవారం సన్మానించారు. పాల్సన్ రాజు, ఐసాక్, కురియన్, జోసెఫ్ ప్రభాకర్, స్వర్ణన్ రాజ్, విద్యాకర్, పాల్ పాల్గొన్నారు.

బీజేపీ ఐటీ, సోషల్ మీడియా తూర్పు ఇన్‌చార్జ్‌గా రతన్



వరంగల్: బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గ ఐటీ, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా కాశిబుగ్గకు చెందిన నోముల రతన్‌ను నియమించారు. ఈమేరకు వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీజిల్‌కాలనీ రైల్వే పెన్షనర్స్ కార్యవర్గం ఎన్నిక

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ డీజిల్‌కాలనీ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యకవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఆర్.మల్లయ్య, కార్యదర్శిగా మేఘరాజ్, కోశాధికారిగా నర్సయ్య ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని 47వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు సిరిల్ లారెన్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అల్లుడు విష్ణువర్దన్‌రెడ్డి, తదితరులు అభినందించారు. కార్యక్రమంలో షేక్ అజ్గర్, ఇప్ప శ్రీకాంత్, సిలువేరు విజయభాస్కర్, గోల్కొండ రాంబాబు, మేకల ఉపేందర్, మానస, మధుకర్, ఎండీ.సాజిద్, కొమురవెల్లి రమేష్, నిరంజన్, భానుచందర్, నాగరాజు, క్రాంతి, భరత్, దేవయ్య, సల్లూరి నాగేశ్వర్ రావు శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రాత్రివేళ జోరుగా ఇసుక దందా

● చోద్యం చూస్తున్న అధికారులు



కాజీపేటలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఇసుక

కాజీపేట: పట్టించుకునే వారు లేక దళారులు యథేచ్ఛగా నగరానికి ఇసుక తరలిస్తూ ఇబ్బడిముబ్బడిగా అర్జిస్తున్నారు. పగటిపూట అయితే అధికారులు పట్టుకుంటారని రాత్రివేళ పని కానిచ్చేస్తున్నారు. జఫర్‌గఢ్ మండలం కూనూరు ఆకేరు వాగు నుంచి కడిపికొండ మీదుగా కాజీపేట పట్టణానికి నిత్యం భారీ సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది.

ఇసుక మాఫియా ఆగడాలు

ఆకేరు వాగు నుంచి భారీ స్థాయిలో ఇసుక రవాణా సాగుతున్న అడ్డుకట్ట వేయడానికి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇసుక మాఫియా ఆగడాలు అంతకంతకు పెరుగుతున్నాయనే పలువురు వాపోతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు, అధికారులకు నాలుగు కాసులు ఇస్తూ పదికాసులు వెనుకేసుకోవడంలో వ్యాపారులు ముందున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరానికి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్న ఇసుక వ్యాపారులు.. సిండికేట్‌గా మారి రాత్రివేళ ఎవరి కంటపడని రీతిలో ఆకేరువాగును లూటీ చేస్తున్నారు. ఎదురు తిరిగిన గ్రామపెద్దలు, కింది స్థాయి అధికారుల చేతులు తడుపుతూ ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు చేపట్టాలని అధికారులను ఇటీవల కలెక్టర్ ఆదేశించగా కాజీపేట పట్టణ శివారులో ఏకకాలంలో దాడులు చేసి డజనుకుపైగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ఆయా పోలీసుస్టేషన్లకు తరలించారు. అధికారుల దాడుల విషయం ముందస్తుగా తెలుసుకున్న మరిమంది వ్యాపారులు తమ వాహనాలు రోడ్డు మీదికి రాకుండా జాగ్రత్త పడ్డారని, లేకపోతే మరో 20కి పైగా ట్రాక్టర్లు దొరికేవని పలువురు భావిస్తున్నారు. ఒకేసారి అన్ని ట్రాక్టర్లు అధికారులకు పట్టుబడ్డాయంటే నిత్యం ఇసుక వ్యాపారం ఎలా సాగుతుందో అవగతం చేసుకోవచ్చు.

ఆకేరువాగు నుంచి తరలి వస్తున్న ట్రాక్టర్ ఇసుక లోడ్‌ను రూ.6,200లకు పైగా విక్రయిస్తున్నారు. అలా తెచ్చిన ఇసుకను డంప్‌ల్లోకి తరలించి సమయం చిక్కినప్పుడల్లా అమ్ముకుంటున్నారు. అధికారుల పట్టింపులేని తనంవల్ల ప్రతీ ట్రాక్టర్‌తో వ్యాపారులు రెండు ట్రిప్పుల ఇసుకను తరలించి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో ఆకేరువాగులో ఇసుక లేక నీరు ఇంకిపోతుండటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. ఇసుక రవాణా చేసే వాహనాల్లో సగం ట్రాక్టర్లకు సరైన కాగితాలు ఉండడం లేదనే ఆరోపణలున్నాయి. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే ఇసుక వ్యాపారులు జోక్యం చేసుకుని పోలీసుల సహకారంతో అతి సులువుగా సమస్య నుంచి బయటపడుతున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న మాఫియా ఆటలు కట్టించడానికి రెవెన్యూ, పోలీసులు సమన్వయంతో కృషి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తాగునీటికి ఇబ్బందులు రావొద్దు





వీసీలో పాల్గొన్న హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, అధికారులు

హన్మకొండ అర్బన్: వేసవి నేపథ్యంలో.. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా కలెక్టర్లు, అధికారులతో తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వడదెబ్బ నివారణ చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ గ్రామాల్లో బోర్‌వెల్స్, వ్యవసాయ బావులను తాగునీటి అవసరాలకు వాడుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కల్గకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వడదెబ్బ నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలన్నారు. సమావేశంలో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, వెంకట్‌రెడ్డి, డీఆర్డీఓ నాగపద్మజ, డీఈఓ అబ్దుల్ హై, డీఎంహెచ్ఓ సాంబశివరావు పాల్గొన్నారు.

కరీమాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ నుంచి కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి వేసవిలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈఓ వాసంతి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీఏఓ ఉషాదయాళ్, డీసీఓ సంజీవరెడ్డి, డీపీఓ కల్పన, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



ఖిలా వరంగల్: పూజలు చేస్తున్న భక్తులు



విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్న పూజారులు

ఖిలా వరంగల్: వరంగల్ గణేష్‌నగర్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు వేణునాథ ఆచార్యులు, రాహుల్ ఆచార్యులు, రఘునాథ చార్యులు, గీతాచార్యులు, కిట్టు ఆచార్య, శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అభయాంజనేయ స్వామిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని నవధాన్యాలను సమర్పించారు. అనంతరం నిర్వాహకులు మహాన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పూజాది కార్యక్రమంలో బండి అశోక్, శ్రీనివాస్‌రావు, రాజు, రాధాకిషన్, విజయ్, సారంగం, రంజిత్, రవీందర్, రవిబాబు, లక్ష్మీనారాయణ, రాకేష్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, హుస్సేన్, కోటి, శ్రీనివాస్, సుమన్, రాకేష్, సంతోష్, విజయ్, ఉమేష్, రవి పాల్గొన్నారు.

భీమారంలోని గౌరీశంకర దేవాలయంలో

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భీమారంలో నూతనంగా నిర్మించిన గౌరీశంకర దేవాలయంలో శివపార్వతులు, గణేశుడు, దుర్గ, సాయిబాబా, ఆంజనేయ స్వామి, అయ్యప్పస్వామి, నవగ్రహ నాగేశ్వర స్వామి సహిత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణ మధ్య వేడుకలు కనులపండువగా జరిగాయి. భీమారంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, దేవస్థాన మాజీ చైర్మన్ చింత లక్ష్మణ్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సాయి పాల్గొన్నారు.

4న జెడ్పీ సర్వసభ్య సమావేశం

వరంగల్ : వరంగల్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 4న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు సీఈఓ రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరుకావాలని, అధికారులు ఎజెండాలోని అంశాలపై పూర్తి సమాచారంతో రావాలని ఆయన కోరారు.

కేయూ పొలిటికల్ సైన్స్ హెచ్ఓడీకి శుభాకాంక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం (హెచ్ఓడీ)గా బాధ్యతలు స్వీకరించిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటయ్యను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ, బాధ్యుల సోమవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బుర్రి సతీష్, ఎంఎస్ఎఫ్ జాతీయ నాయకులు రాగళ్ల ఉపేందర్, కేయూ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డేపెల్లి మధు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు చాగంటి రమేష్, బాధ్యులు చంద్రశేఖర్, శ్రీనాథ్, అరిస్టాటిల్, దూడపాక నరేందర్, పసుల విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ పొలిటికల్ సైన్స్ బీఓఎస్ చైర్మన్‌కు సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం కృష్ణను కేయూ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో కేయూ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, బాధ్యులు మధుకర్‌రావు, చీకటి శ్రీనివాస్, సంగీత్‌కుమార్, చిలువేరు రాజ్‌కుమార్, బ్రహ్మయ్య, సుధాకర్, సత్యనారాయణ, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఏనాడూ పట్టించుకోని కేసీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

హన్మకొండ: పదేళ్ల అధికారంలో ఉండి బయటకు రాకుండా ఇప్పుడు ఫాం హౌజ్ నుంచి నేరుగా బయటకు వచ్చి.. పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వంపై మాజీ సీఎం కేసీఆర్ దుమ్మెత్తిపోస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ధ్వజమెత్తారు. హనుమకొండ సుబేదారిలోని స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలో ఉన్నన్ని రోజులు సచివాలయానికి కేసీఆర్ రాలేదని, రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. రైతుల పాపానికి మాజీ ఆయనే కారణమని అన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ పథకాలను కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఏటీఎంలా వాడుకున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డి బయటకు తెస్తున్నారని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్లే భూగర్భజలాలు అడుగంటాయని నాగరాజు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో 6,130 మంది రైతులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన కడియం శ్రీహరి, కావ్య

హనుమకొండ సుబేదారిలోని స్వగృహంలో ఎమ్మెల్యే నాగరాజును స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కడియం కావ్య కలిశారు. అనంతరం వారు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సీతంపేట మాజీ ఎంపీటీసీ గిన్నారపు సుగుణ, మాజీ సర్పంచ్‌లు పెసరు శ్రీనివాస్‌రెడ్డి, ఐలయ్యతో పాటు ముచ్చర్ల, పెగడపల్లి, పలువేల్పులకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే నాగరాజు ఆహ్వానించారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

● 7వ తేదీ వరకు కొనసాగనున్న ఉత్సవాలు

రామన్నపేట: వరంగల్ మట్టెవాడలోని గోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు ఈనెల 2నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ బ్రహ్మోత్సవ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఇరుకుల్ల రమేష్ తెలిపారు. దేవస్థానంలో ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి వేడుకల వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వేడుకల సందర్భంగా దేవస్థానానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతిఏటా వైభవంగా నిర్వహిస్తున్న ఉత్సవాలను ఈఏడాది కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వేద పండితులు రాఘవాచార్యులు, ఆరుట్ల రామాచార్యులు, మాజీ కార్పొరేటర్ తోట నవీన్‌కుమార్, కొత్త వెంకటకృష్ణ, పబ్బ విశ్వప్రసాద్, బేజుగం రజనీకాంత్, నాగేశ్వర్‌రావు, దివ్వెల నాగరాజు, గుండా రాజేష్, దొడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు భారీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: రంజాన్ పండుగ ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు ఈద్గా మైదానంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ తెలిపారు. ఈనెల 11న జరగనున్న రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఈద్గా మైదానంలో ప్రారంభమైన నమాజ్‌కు కావాల్సిన ఏర్పాట్ల పనులను ముస్లిం మతపెద్దలతో కలిసి జబ్బార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్గా మైదానంలో మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఆహ్లాదమైన వాతావరణంలో సామూహిక ప్రార్థనలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, అశ్రఫ్, దస్తగిరి, అమ్జద్, మాషూక్, హసన్, మగ్దుం, బల్దియా సూపర్‌వైజర్ సాంబయ్య, శానిటరీ జవాన్ రాజు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జనార్దన్

మామునూరు: పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, దళారులకు అమ్మకుండా నేరుగా ప్రభుత్వానికే విక్రయించాలని ఖిలా వరంగల్ మండల పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్ సూచించారు. తిమ్మాపురం గ్రామంలో పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నోడల్ అధికారి నాగనారాయణతో కలిసి జనార్దన్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. వరికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకుందని తెలిపారు. తిమ్మాపురం, అల్లీపురం, సింగారం, అమ్మవారిపేట, లక్ష్మీపురం, నాయుడు పెట్రోల్ బంక్ గ్రామాల రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ తోటకూర నర్సయ్య, పసునూరి భిక్షపతి, పిన్నింటి రాజేశ్వర్‌రావు, ముప్పు సతీష్, షణ్ముఖ రెడ్డి, ఇనుగాల జోగిరెడ్డి, మాజీ సర్పంచ్ సదానందం, చింత ప్రకాశ్, మాచర్ల చంద్రమౌళి, దూడ శ్రీను, ఆవులూరి దశరథం, చింత రాజు, కాగిత రాజు, బక్కరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి రమేష్ వాహనం తనిఖీ



మడికొండ: బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ వాహనాన్ని పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. పాలకుర్తి నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశానికి వెళ్తుండగా మడికొండ పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎస్సై దివ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3 లక్షల నగదు సీజ్

కాజీపేట: కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీ ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి పోలీసులు, ఎన్నికల అధికారులు జరిపిన వాహనాల తనిఖీల్లో రూ.3 లక్షల నగదును సీజ్ చేశారు. ఓ కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును సోదాల్లో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపించి తీసుకోవాలని ఎన్నికల అధికారి సూచించారు.

ఉద్యమంలో కీలకంగా పనిచేశా

హసన్‌పర్తి: వరంగల్ ఎంపీగా తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు సంగాల విక్టర్ బాబు కోరారు. ఈమేరకు సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావుకు తన బయోడేటాను సోమవారం అందించారు. ఉద్యమంలో కీలకంగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాజీపేట: మోసపూరితమైన ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న టెక్నాలజీని సైబర్ నేరగాళ్లు ఆసరాగా చేసుకొని అమాయక ప్రజలకు అధిక లాభాలు, వడ్డీని ఆశగా చూపించి మోసం చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. సైబర్ నేరానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

విలేకరికి పరామర్శ

హన్మకొండ చౌరస్తా: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పదిరోజులుగా హనుమకొండలోని ఏకశిల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రజాపక్షం విలేకరి శ్రీనివాస్‌ను పలువురు జర్నలిస్టు యూనియన్, ప్రెస్‌క్లబ్ బాధ్యులు సోమవారం పరామర్శించారు. శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లేందుకు రాష్ట్ర యూనియన్ నాయకులతో మాట్లాడారు. పరామర్శించిన వారిలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర నాయకులు కంకణాల సంతోష్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి సదయ్య, జర్నలిస్టులు ఉన్నారు.

ఘనంగా విద్యా, సాంస్కృతిక మేళా

కాజీపేట అర్బన్: నగరంలోని న్యూశాయంపేటలోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విద్యా, సాంస్కృతిక మేళాను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉపన్యాసాలు ఆలోచింపజేయగా, సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ వేషధారణలు ఆకట్టుకున్నాయి.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండలో జరిగింది. మడికొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ శివారు రామన్ స్కూల్ సమీపంలో మతిస్థిమితం లేకుండా ఉన్న ఓ వ్యక్తిని పోలీసులు ఆదివారం గుర్తించి చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. వివరాల కోసం 87126 85123, 87126 85248, 87126 85009 నంబర్లలో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

మడికొండ: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి మెజిస్ట్రేట్ విద్యాసాగర్ జైలుశిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపారు. మడికొండ చౌరస్తాలో వాహన తనిఖీ చేస్తుండగా మద్యం తాగి పట్టుబడిన దీపక్ (ఉత్తరప్రదేశ్ రాష్ట్రం), అన్నారం రవి (ఉప్పరపల్లి), కనకం రఘు (చిల్పూర్)కు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ రెండవ తరగతి మెజిస్ట్రేట్ విద్యాసాగర్‌రావు తీర్పు వెలువరించినట్లు వివరించారు. మరో ముగ్గురికి రూ.4,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

బైక్‌పై స్టంట్స్ చేసిన యువకుల అరెస్టు

రామన్నపేట: రోడ్లపై ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ద్విచక్ర వాహనాలపై స్టంట్ చేస్తే చట్టపరమైన చర్యల్లో భాగంగా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి హెచ్చరించారు. బైక్‌లపై స్టంట్‌లు చేస్తూ నయీంనగర్‌కు చెందిన సాయి విఘ్నేష్, మేకల అనుదీప్ అనే యువకులు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వీడియో ఆధారంగా ఆ ఇద్దరిని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే, భారీ శబ్దం వచ్చేలా సైలెన్సర్లను ఉపయోగించిన వాహనాలదారులపై కూడా చర్యలు తప్పవని ఆయన అన్నారు.

దళిత క్రైస్తవులకు ఎంపీ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న బొడ్డు సునీత

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని దళిత క్రైస్తవులకు కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని సెయింట్‌పాల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బొడ్డు సునీత కోరారు. హనుమకొండ కంచరకుంటలోని స్కూల్ ఆవరణలో పాస్టర్లతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశం ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి కష్టపడిని వారిని కాదని ఇతర పార్టీల నుంచి వచ్చేవారికి టికెట్ ఇవ్వొద్దని సూచించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో దళిత క్రైస్తవుల ఓటు బ్యాంకు ఉందని, ఈక్రమంలో దళిత క్రైస్తవులకే టికెట్ ఇవ్వాలని కోరారు. మూడు దశాబ్దాల కాలంగా మహిళలకు కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వలేదని గుర్తుచేశారు. ఈ పర్యాయం తనకు కేటాయిస్తే కచ్చితంగా గెలుస్తాననే ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ మోజెస్‌పాల్ ఆనంద్, ట్రైసిటీస్ క్రిస్టియన్ బాధ్యులు పోలెపాక ఇమ్మానియేల్, దైవజనులు మోజెస్, స్టాలిన్, కుమార్, రత్నం, థామస్‌తో పాటు పాస్టర్లు పాల్గొన్నారు.

వంగపల్లి శ్రీనివాస్‌కు అవకాశం ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్‌ఖన్నా

హన్మకొండ: బాబుమోహన్‌కు బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఇవ్వొద్దని, వంగపల్లి శ్రీనివాస్‌కు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ -టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా సూచించారు. హనుమకొండలోని కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ రాష్ట్ర మాదిగల ప్రతినిధి వంగపల్లి శ్రీనివాస్ మాదిగకు బీఆర్ఎస్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రసాధన కోసం హైదరాబాద్ నుంచి వరంగల్ వరకు పాదయాత్ర చేసిన ఘనత శ్రీనివాస్‌దని గుర్తుచేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి విజయకుమార్ పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో చండీహోమం



కాశిబుగ్గ: మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని చారిత్రక కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ ఆవరణలోని యాగశాలలో రెండు హోమ గుండాల్లో 9మంది దంపతులతో చండీహోమం జరిపించారు. భక్తులు చండీహోమంలో పాల్గొని పూజలు చేశారు. హోమంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, డాక్టర్ గోనె జగదీశ్వర్, బోడకుంట్ల వైకుంఠం, బొమ్మగాని కృష్ణమూర్తి, ఉమాశంకర్, జంగం రాజు, రమేష్, దయాసాగర్, భాస్కర్, సతీష్ పాల్గొన్నారు.